క్లుప్తంగా

గోదాదేవి అమ్మవారికి అభిషేకాలు


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

జామి: గోదాదేవి అమ్మవారి జన్మదినం సందర్భంగా పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు రవి అమ్మ వారికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. అనం తరం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

గుర్ల: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ భాస్కరరావు సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలతో పాటు పలు చట్టాలపై పాలవలస హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రవాణా చేయడం, వినియోగించ డం నేరమన్నారు. గంజాయి, మద్యం, డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని చెప్పారు. ఆకతాయిలతో తిరిగి కాలాన్ని వృథా చేసుకుంటే భవిష్యత్ నాశనమవుతుందని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.

కొత్తవలస సీఐగా షణ్ముఖరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ షణ్ముఖరావు

కొత్తవలస: కొత్తవలస సీఐగా సీహెచ్.షణ్ముఖరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీపురుపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్ వీఆర్‌పై విశాఖపట్నం రేంజ్‌కు బదిలీ అయ్యారు. నూతన సీఐ షణ్ముఖరావుకు ఎస్ఐ సుదర్శన్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నేరనియంత్రణకు కృషి చేస్తానని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.

ఎండిపోతున్న వరిపంట పరిశీలన


ఇంగిలాపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: వరినాట్లు వేసిన తర్వాత వర్షాలు లేకపోవడంతో మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో ఎండిపోతున్న వరి పంటను ఏఓ అను రాధ బుధవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, వ్యవసాయ సిబ్బంది ఇచ్చే సలహాలు పాటించాలని సూచించారు. వరిసాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

టేక్ హోమ్ రేషన్‌పై శిక్షణ


మాట్లాడుతున్న పీడీ శాంతకుమారి

గంట్యాడ: ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీపై స్థానిక ఐసీడీఎస్ కార్యా లయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారా న్ని ఇక నుంచి గర్భిణులు, బాలింతలకు ఇళ్ల వద్దే అందించనున్నట్లు తెలిపారు. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా రేషన్ పంపిణీ కిరాష్ట్రంలో విజయనగరం అర్బన్, గంట్యాడ ప్రాజెక్టులను ప్రభుత్వం ఎంపిక చేసిందని చెప్పారు. స్టేట్ కో–ఆర్డినేటర్లు సునీత, మెర్విన్, ఐసీడీఎస్ పీఓ డోకుల ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ వితరణ

లక్కవరపుకోట: గురుదేవా చారిటిబుల్ ట్రస్టు సహకారంతో వేపాడ మండలం భర్తాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఆదారి సూర్యానారాయణకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం ట్రైసైకిల్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుదేవా చారిటబల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు దివ్యాంగులకు ఎనలేనిసేవ చేస్తున్నారని, ఎంతోమంది దివ్యాంగులకు ఉపకరణాలు,కృత్రిమ అవయవాలు అందజేసి వారికి కొత్తజీవితాన్ని అందిస్తున్నారని కొనియాడారు.వేపాడ, ఎస్.కోట మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతల కంటకన్నీరు

- ఇంకా చేరని తోటపల్లి సాగు నీరు
- ఎండిపోతున్న నారు మడులు


చీపురుపల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో ఎండిపోతున్న వరి నాట్లు

చీపురుపల్లి: పంటల సాగుపైనే ఆధారపడి జీవించే అన్నదాత కంట కన్నీరొలుకుతోంది. తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా ఏడాదికి రెండు పంటలు పండించుకునే రైతులు కనీసం ఖరీఫ్‌లో సైతం సాగునీరు అందక ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జూన్ నెలాఖరు నాటికి తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు పంట పొలాలకు అందాల్సి ఉంది. ఆగస్టు మొదటి వారం పూర్తయినప్పటికీ ఇంతవరకు కాలువల ద్వారా సాగునీరు రాకపోవడంతో వరి నారు మడులు ఎండిపోతున్నాయి. ఇప్పటికే పరిసరాల్లో ఉన్న నీటి కుంటలు, తోటపల్లి కాలువలో ఉన్న అడుగు నీరుతో దమ్ములు పట్టి, వరి నాట్లు వేశారు. తీరా నాట్లు వేశాక వర్షాలు లేక, తోటపల్లి నీరు రాకపోవడంతో నారు మడులు ఎండిపోతున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో దాదాపు 15 వేల ఎకరాలకు తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. కానీ ఇంతవరకు తోటపల్లి నీరు రాకపోవడంతో రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు.

ముందు శ్రీకాకుళం బ్రాంచి కెనాల్‌కు నీరు..

తోటపల్లి ప్రాజెక్టు నుంచి కుడి ప్రధాన కాలువకు సాగునీరు విడుదల చేసినప్పటికీ చీపురుపల్లి మీదుగా ఉన్న కాలువ నుంచి శ్రీకాకుళం బ్రాంచి కెనాల్‌కు నీరు వెళ్తోంది. చీపురుపల్లి నుంచే సాగునీరు వెళ్తున్నప్పటికీ ఇక్కడి పంట పొలాలకు నీరు ఇంతవరకు రావడం లేదు. శ్రీకాకుళం బ్రాంచ్ కెనాల్‌కు పూర్తి స్థాయిలో సాగునీరు పంపిన తరువాత చీపురుపల్లి మండలంలో పంట పొలాలకు సాగునీరు అందించనున్నట్లు తెలుస్తోంది.

పదో తేదీ తరువాత తోటపల్లి నీరు..

చీపురుపల్లి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే పలు ప్రాంతాలకు తోటపల్లి నీరు అందుతోంది. ప్రస్తుతం శ్రీకాకుళం బ్రాంచి కెనాల్‌కు నీరు వెళ్తోంది. మరో మూడు రోజుల తరువాత 96.7 కిలోమీటర్ వద్ద ఉన్న గేటు వద్ద శ్రీకాకుళం బ్రాంచి కెనాల్‌ను మూసివేసి చీపురుపల్లి మండలంలో మిగిలిన ప్రాంతాలకు సాగునీరు అందిస్తాం. రావివలస పరిసర ప్రాంతాల్లో తోటపల్లి కాలువల్లో పూడిక తీత పనులు నిర్వహిస్తున్నాం.
– సుచిత్ర, డీఈ, తోటపల్లి ప్రాజెక్టు, చీపురుపల్లి


తోటపల్లి కాలువలో ఊట నీటిని ఇంజిన్లతో పంట పొలాలకు తోడుకుంటున్న రైతులు


పూడిక, తుప్పలతో నిండిపోయిన తోటపల్లి కాలువ

పర్యావరణ హితుడికి సత్కారం


హరికృష్ణను సత్కరిస్తున్న యువత

చీపురుపల్లి: పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గరివిడి మండలంలోని కె.పాలవలస గ్రామానికి చెందిన కె.హరికృష్ణ ఇటీవల చీపురుపల్లి నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేశారు. ఆయన్ని పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యువత బుధవారం సత్కరించారు. హరికృష్ణను యువకులు అభినందించారు. కార్యక్రమంలో రన్ మిషన్ అకాడమీ కోచ్‌లు కె.హేమంత్, వై.లక్ష్మణరావు,బి.నవీన్, ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి కేసులో నిందితులకు రిమాండ్


పట్టుబడిన నిందితులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆటోను అడ్డగించి డ్రైవర్‌పై దాడిచేసిన కేసులో ఏడుగురు నిందితులకు చీపురుపల్లి మున్సిఫ్ కోర్టు రిమాండ్ విధించిందని గరివిడి ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. కేసుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు...మెరకముడిదాం మండలం గరుగుబిల్లి గ్రామానికి చెందిన పలువురు తిరుపతి వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన గుడివాడ సోంబా బు ఆటోలో మంగళవారం రాత్రి విజయనగరం రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. వారు వెళుతున్న ఆటోను చీపురుపల్లి–రాజాం ప్రధాన రహదారిలో కాపుశంభాం జంక్షన్ వద్ద రాత్రి 12 గంటల సమయంలో ఏడుగురు వ్యక్తులు అడ్డగించారు. ఆటో డ్రైవర్ సోంబాబును బలవంతంగా ఆటో నుంచి కిందికిలాగి మద్యానికి డబ్బులు ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరించారు. ఆటోడ్రైవర్ మెల్లగా వారి నుంచి తప్పించుకుని వెళ్తుండగా నిందితులు కారు,బైకుతో వెంబడించారు. ఆటోలో ఉన్నవారికి భయం వేసి అదే రహదారికి ఆనుకుని ఉన్న బి.జె.పాలెం గ్రామంలోని రామమందిరం వీధి వైపు ఆటోను తిప్పి కేకలు వేశారు. ఆటోడ్రైవర్‌పై పిడిగుద్దులు రూ.1000 లాక్కున్నారు, ఇంతలో వీధిలో ఉన్న వారు లేచి అక్కడికి రావడంతో నిందితులు పరారయ్యారు. ఘటనపై ఆటోడ్రైవర్ 100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకుని కోర్టుకి తరలించగా, కోర్టు వారికి రిమాండ్ విధించింది.

వందరోజులు పని కల్పించండి


ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ ఉమాపరమేశ్వరి

కొత్తవలస: ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ వందరోజులు పని కల్పించాలని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో ఎస్.కోట క్లస్టర్ పరిధిలోని అయిదు మండలాల ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా వందరోజులు పనిదినాలు పూర్తి చేసు కున్న జాబ్‌కార్డుదారుల వివరాలపై ఆరా తీశారు. పని కల్పించడంలో వెనుకబడిన ఫీల్డ్ అసిస్టెంట్లను మందలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హత ఉండి, అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు అందజేయాలని చెప్పారు. సీజన్‌తో సంబంధం లేకుండా వేతనదారులకు పని కల్పించేలా క్షేత్ర సహాయకులు వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం రైతుల భూముల్లో పండ్ల తోటల పెంపకం, చెరువు గట్లు రోడ్ల పక్కన మొక్కల పెంపకం తదితర పనులను గుర్తించాలన్నారు. ఏపీడీ ఎస్.శారదాదేవి, అయిదు మండలాల ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ సహాయకులు పాల్గొ న్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన


వేపాడ: సోంపురంలో రైతులతో కాలిబాటలు తీయిస్తున్న వ్యవసాయ అధికారులు


గంట్యాడ: తాటిపూడిలో రైతులకు బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న గాయత్రి

వేపాడ: వరి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై సోంపురం గ్రామంలో రైతులకు కొత్తవలస వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీఏ విజయ, ఏఓ సి.బి. యశ్వంతరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. వరినాట్లు పూర్తయిన పొలాల్లో రైతుల తో కాలిబాటలు తీయించి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే ద్రవజీవామృతం తయారీ, దాన్ని వినియో గించే విధానాన్ని వివరించారు. వర్షాభావంతో పొలాలు బీటలు వారుతు న్న దృష్ట్యా 5 లీటర్ల జీవామృతాన్ని 100 లీటర్ల నీటి ల్లో కలిపి ఎకరా పొలానికి పిచికారీ చేయాలన్నారు. అలాగే సుడోమోనస్‌ను గత్తంలో కలిపి వరి పొలాల్లో వేయాలని సూచించారు. ఇలాచేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చని చెప్పారు. పొలాల్లో పసుపు పల్లాలను అమర్చారు. సీఎస్‌పి కో–ఆర్డినేటర్ వెంకటరావు, వీఏఏలు, ఎంటీఎల్, ఎంటీఎస్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రంతో చీడపీడల నివారణ

గంట్యాడ: బ్రహ్మాస్త్రంతో వరి పంటలో రసం పీల్చే పురుగులతో పాటు ఇతర చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం గంట్యాడ యూనిట్ ఇన్‌చార్జి వర్రి గాయత్రి అన్నారు. తాటిపూడి గ్రామంలో రైతులకు బ్రహ్మాస్త్రం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు.15 లీటర్ల దేశీయ గోమూత్రం, 2 కిలోల చొప్పున వేప, సీతాఫలం, బొప్పాయి, కానుగు,జామ,ఈత ఆకులను కలిపి ముద్దగా చేసుకొని, దాన్ని అయిదు పొంగులు వచ్చే వరకు మరగని వ్వాలన్నారు. ఈ కషాయాన్ని 48 గంటల పాటు నిల్వచేసుకున్న తర్వాత 100 లీటర్ల నీటిలో 5లీటర్ల కషాయం కలిపి ఎకరా విస్తీర్ణానికి పిచికారీ చేసుకోవాలని వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జ్యోతి, సింహాచలం, రామ్మూర్తి పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ, పీజీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉన్నాయని, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 40 సీట్లు, కంప్యూటర్ సైన్స్‌లో 30 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. 2024లో ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నేడు గ్రామసందర్శన

చీపురుపల్లి/బొండపల్లి/వేపాడ/లక్కవరపుకోట/కొత్తవలస: చీపురుపల్లి మండలంలోని పేరిపి, బొండపల్లి మండలంలోని మరువాడ, వేపాడ మండలంలోని చామ లాపల్లి, ఎల్.కోట మండలంలోని దాసుళ్లపాలెం, కొత్తవలస మండలంలోని దెందేరు గ్రామాల్లో గురువారం గ్రామసందర్శన నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు గ్రామసందర్శన నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు డి.శ్వేత, ఎస్.హరిహరరావు, నిశ్చల, కె.రూపేష్, ఎస్.రమణయ్య బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తారని, ప్రజలు తమ సమస్య లపై వినతిపత్రాలు అందజేయవచ్చని సూచించారు. కార్యక్రమానికి మండలాల అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరవ్వాలని కోరారు.

హామీ మేరకు జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి

చీపురుపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం జీఓ నంబర్ 117ను రద్దు చేసి కొత్త నిబంధనలు తీసుకొచ్చిన తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఓ నంబర్ 117 రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యలు ప్రారంభించడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో జీఓ నంబర్ 117ను తీసుకొచ్చి తద్వారా 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారన్నారు. ఒకటి, రెండు తరగతలు ఉండే పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల వరకు ఉన్నాయని చెప్పారు. అయితే ఆ విధానం సరైనది కాదని తాము అధికారంలోకి వస్తే జీఓ 117ను రద్దు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన కూటమి నేతలు.. తీరా ప్రభుత్వం వచ్చిన తరువాత జీఓను రద్దు చేయలేదన్నారు. జీఓ 117ను రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయొద్దని కోరారు.

యాంత్రీకరణతో పెట్టుబడి ఆదా


ట్రేలలో పెంచిన వరినారును పరిశీలిస్తున్న ఏడీఏ మహరాజన్

బొండపల్లి: సాగులో యంత్ర పరికరాలను వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను ఆదా చేయవచ్చని, అధిక దిగుబడులు సాధించవచ్చ ని గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ అన్నారు. యంత్రాల ద్వారా నాట్లు వేసేందుకు నెలివాడ రైతుసేవా కేం ద్రం పరిధిలో ట్రేలలో పెంచిన వరినారును బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్పుడు ట్రేలలో నారును పెంచడం మంచి పద్ధతని అన్నారు. ఈవిధంగాపెంచిన నారును యంత్రాల ద్వారా నాటు కోవడం వల్ల రైతులకు ఎకరానికి రూ.4వేల నుంచి రూ. 5వేల వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. ఆయన వెంట ఏఓ పి.వి.మల్లికార్జున రావు, వీఏఏ జె.సునీల్ తదిత రులు ఉన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇష్టారీతిగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం, పాఠశాలల్లో మధ్యా హ్న భోజన నిర్వాహకులను తొలగించడం వంటి చర్యలకు దిగుతున్నారని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షత న బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఎలాంటి ఫిర్యాదులు రాకున్నప్పటికీ అకారణంగా వారిని తొలగిస్తున్నారని సభ దృష్టికి తీసుకు వచ్చారు.ఎంపీపీ స్పందిస్తూ ఎంఈఓ భానుప్రకాష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేయడం, అర్హతలేనివారితో కిట్లు పంపిణీ చేయించడంపై విస్మయం వ్యక్తం చేశారు. డ్వాక్రా సంఘాల్లో ఎంబీకే లుగా పనిచేస్తున్న వారిని రాజీనామాలు చేయాలని ఏపీఓ నారాయణరావు ఒత్తిడి చేస్తున్నారని సభ్యులు ఫిర్యాదు చేశారు. దమరసింగి గ్రామ రైతుసేవా కేంద్రంలో సర్పంచ్, ఎంపీటీసీలకు తెలియకుండా బయట వ్యక్తులతో ఎరువుల పంపిణీ చేయించడమేంటని ఎంపీపీ అభ్యంతరం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ప్రజా ప్రతినిధు లకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. భూములకు సంబంధించి వన్‌బీలు రాకపోవడం వల్ల రైతులు ఇబ్బందులుపడు తున్నారని, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ ఆదిలక్ష్మిని ఎంపీపీ ఆదేశించారు. ఎంపీడీఓ వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు


గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు

కొత్తవలస: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వియ్యంపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు పూలు,పండ్లు, పసుపు, కుంకుమ అందజేసి ఆశీ ర్వదించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. బిడ్డకు తల్లిపాలు అందించాల్సిన ఆవశ్యకతపై కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ అవగాహన కల్పించారు.తహసీల్దార్ నీలకంఠరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల స్వర్ణలత, రమణమ్మ, టీడీపీ నాయకులు గొరపల్లి రాము,కనకాల శివ,యల్లపు సూరిబాబు, మాశేని నవీన్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం మేట్లపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: తమటాడ గ్రామంలో ఉపాధిహామీ పథకం మేట్లు ఎం.సూజాత, ఎస్.సన్యాసమ్మ గ్రామంలో లేని జాబ్‌కార్డుదారులతో పాటు,గ్రామంలోనే ఉంటూ పని కి హాజరుకాని 23 మంది పేరున బినామీ మస్తర్లు వేసి వేతనాలను సీఎస్‌పీల వద్ద డ్రా చేసినట్లు జిల్లా కలెక్టర్ అంబేడ్కర్‌కు పలువురు వేతనదారులు ఫిర్యాదు చేశారు. గతనెల 25న ముద్దూరులో జరిగిన గ్రామసందర్శనలో కలెక్టర్‌ను కలిసిన వేతనదారులు మేట్లపై విచారణ కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావును కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు గత శనివారం గ్రామంలో ఎంపీడీఓ విచారణ నిర్వహించగా వేతనదారులు, మేట్ల మధ్య వాగ్వాదం జరగడంతో వాయిదా వేశారు. బుధవారం గ్రామంలోని పాఠశాల వద్ద విచారణ చేపట్టగా మేట్లకు, వేతనదారులకు మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు అరుపులు, కేకలు వేసుకున్నారు. ఇలా అయితే విచారణ చేపట్టలేమని సహకరించాలని గ్రామస్తులను ఎంపీడీఓ కోరారు. ఎంతమంది పేరున బినామీ మస్తర్లు వేశారు, ఎంత మొత్తాన్ని డ్రా చేశారన్న వివరాలను తెలుసుకున్నారు. నివేదికను జిల్లా అధికారులకు అందజే యనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఏఓ డి.వెంకటరమణ, ఏపీఓ బి.కృష్ణవేణి, ఈసీ సన్యాసిరావు, ముద్దూరు సర్పంచ్ మునకాల పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బడిబస్సు నడిపేందుకు రూట్ సర్వే


జాకేరు రూట్‌లో సర్వే చేస్తున్న అధికారులు

వేపాడ: మండలంలోని జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట మీదుగా బడి బస్సు నడిపేందుకు ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ తదితరులు బుధవారం రూట్ సర్వే నిర్వహించారు. బడిబస్సు కోసం సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు ప్రజాదర్బార్‌లో విద్యాశాఖామంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. మంత్రి ఆదేశాలమేరకు అధికారులు సర్వే చేశారు. ఈ రోడ్డులో అక్కడక్కడా ఉన్న గుంతలను పూడ్చాలని అధికారులు సూచించడంతో జాకేరు గ్రామపెద్ద బుద్దా అప్పలనాయుడు క్రషర్ మెటల్, బుగ్గి తెప్పించి రోడ్డు మరమ్మతులు చేయించారు.ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ సన్నిబాబు, ఈఓపీఆర్డీ ఉమ, ఎంఈఓ బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలే పోషకాహారం


చీపురుపల్లి: గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు


దత్తిరాజేరు: మరడాంలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి స్రవంతి, తదితరులు

చీపురుపల్లి: బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఆహారంగా అందించాలని, తల్లిపాలను మించిన పోషకాహారం లేదని ఐసీడీఎస్ కర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ టి.కృష్ణవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పేరిపి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలే అందిస్తామని గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, బిడ్డపుట్టిన వెంటనే ముర్రుపా లు పట్టించాలని సూచించారు. బిడ్డకు ఏడు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు సీమంతాలు చేశారు. మెట్టపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జె.పైడిమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

దత్తిరాజేరు: తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యకరమని కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మరడాంలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆరునెలల వరకు తల్లిపాలే తాగిన పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందని, వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.